

నేటి నుంచి రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ బాధ్యుడు ప్రభాకర్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల 13, 14, 15 తేదీల్లో జరిగే 4వ తెలంగాణ రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ చాంపియన్ షిప్ (పురుషులు) నిర్వహించనున్నట్లు అసోసియషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పుప్పాల సంజీవరావు, కల్లూరి ప్రభాకర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని గుమ్ముదూరు ప్రభుత్వ బాలికల పాఠశాలలో గురువారం నిర్వహించిన అసోసియేషన్ సమావేశంలో వారుమాట్లాడారు. రాష్ట్రస్థాయి పోటీలు విజయవంతంగా నిర్వహించేందుకు పలు కమిటీలను వేసినట్లు తెలిపారు. కమిటీ బాధ్యులు ఎవరికీ అప్పగించిన బాధ్యతను వారు నిర్వహించి, క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. రాష్ట్రస్థాయి క్రీడలకు మానుకోట ఆతిథ్యం కావడం ఆనందంగా ఉందన్నారు. అసోసియేషన్ బాధ్యులు పద్మావతి, శ్రీనివాస్, పుష్పలీల, పీడీలు పాల్గొన్నారు.

సన్నాలకే మొగ్గు

వానాకాలంలో తాళ్లపూసపల్లి-గాంధీనగర్‌ల మధ్య వేసిన సన్నరకం పొలం



- రూ.500 బోనస్‌తో రైతుల ఆసక్తి
- యాసంగిలో వరి సాగుకు సైఅంటున్న కర్షకులు
- 1,49,353 ఎకరాల్లో పంట వేసేందుకు సన్నద్ధం

మహబూబాబాద్ అగ్రికల్చర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం సన్నరకాల వడ్లు క్వింటాకు బోనస్ ఇస్తోండటంతో రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. యాసంగిలోనూ సన్న వడ్లకు ప్రోత్సాహం అందిస్తోండడంతో సైతం ఆ రకాల పంటలనే సాగు చేయడానికి మొగ్గు చూపుతున్నారు. ఈ నేపథ్యంలో మహబూబాబాద్ జిల్లాలో వ్యవసాయ శాఖ రైతులను సన్నాలు వేసేందుకు సన్నద్ధం చేస్తోంది. ఈ వానాకాలంలో పండించిన సన్నరకాల ధాన్యానికి రూ.500 బోనస్ పథకం విజయవంతం కావడంతో.. యాసంగిలో కూడా సన్నాలకు సీఎం రేవంత్‌రెడ్డి బోనస్ ఇస్తామని ప్రకటించడంతో వాటిని పండించేందుకు చేసేందుకు రైతులు అడుగులు ముందుకు వేస్తున్నారు. యాసంగిలో వివిధ పంటల ప్రణాళికను జిల్లా వ్యవసాయాధికారులు ఇప్పటికే సిద్ధం చేశారు. జిల్లాలో 2.04 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయడానికి అంచనాలు తయారయ్యాయి.

వానాకాలం సీజన్‌లో ఇలా..

గత వానాకాలం సీజన్‌లో 2,19,151 ఎకరాల్లో వరిని సాగు చేశారు. అందులో 2,12,123 ఎకరాల్లో సన్నరకాలను పండించారు. 4,45,458 మెట్రిక్ టన్నుల సన్నధాన్యం దిగుబడులు వస్తాయని వ్యవసాయశాఖ అధికారులు అంచనాల వేశారు. అయితే 7,028 ఎకరాల్లో దొడ్డురకం వేయగా, 15,461 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనాలు వేస్తున్నారు. వెరసి 2,19,151 ఎకరాలకు గాను మొత్తం 4,60,919 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుంది. జిల్లాలో ప్రస్తుతం ఇంకా వరికోతలు పూర్తి కాలేదు.

బోనస్‌తో లాభమే..

వానాకాలంలో సన్నవడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన విధంగానే కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన ధాన్యానికి రైతుల ఖాతాల్లో ఆ డబ్బుతో పాటు రూ.500 బోనస్ కూడా విడుదల చేస్తున్నారు. చిన్నపాటి, మధ్య తరగతి, బడా రైతులు ధాన్యం అమ్మగా వచ్చిన డబ్బుతో పాటు బోనస్ కూడా రైతుల ఖాతాల్లో జమ అవుతుండడంతో వారిలో సంతోషం వ్యక్తమవుతోంది. కొంత మంది బడా రైతులు మాత్రం భారీగానే వడ్లు పండించడంతో బోనస్ కూడా భారీగానే వస్తోంది. ఇప్పటి వరకు ఓ రైతుకు బోనస్ రూపంలో రూ.2.58 లక్షల వరకు రావడంతో ఆయన సంతోషానికి అవధుల్లేకుండా పోయాయి. అదే విధంగా ముఖ్యమంత్రి ఇటీవల యాసంగిలో సైతం సన్నధాన్యం పండించిన రైతులకు బోనస్ రూపంలో రూ.500లు వర్తింప చేస్తామని ప్రకటించారు. దీంతో సన్నధాన్యం వేసేందుకు జిల్లాలోని రైతులు వరినారు మడులను సిద్ధం చేస్తున్నారు.



మహబూబాబాద్-తాళ్లపూసపల్లి మధ్య ఉన్న బేరువాడలో యాసంగి నారుమడి

యాసంగిలో 2.04 లక్షల ఎకరాల్లో సాగు..

ఈ యాసంగిలో 2,04,018 ఎకరాలలో వివిధ పంటలు సాగవుతాయని మహబూబాబాద్ జిల్లా వ్యవసాధికారి విజయనిర్మల తెలిపారు. సన్నరకాలు భారీగానే సాగు అయ్యే అవకాశాలు ఉన్నాయి. వరి 1,49,353 ఎకరాల్లో పండించేందుకు సిద్ధమవుతున్నారు. నెల్లికుదురు, మరిపెడ, తొర్రూరు, మహబూబాబాద్, కేసముద్రం, పెద్దవంగర, కురవి మండలాల్లో సన్నరకాలను అత్యధికంగా సాగు చేయనున్నారు. అలాగే మొక్కజొన్న 46,934 ఎకరాలు, జొన్న 1,055, వేరుశనగ 717, నువ్వులు 92, మంచిశెనిగలు 10, బొబ్బెర్లు 2,169, పెసర్లు 2,667, ఉలువలు 66, సన్‌ఫ్లవర్ 375, మినుములు 580 ఎకరాల్లో సాగు చేయనున్నారు. ఏది ఏమైనా ఈ యాసంగిలో సన్నరకాలన అధికంగా పండించే అవకాశం ఉంది.

గ్రామీణ క్రీడలకు సర్కార్ పెద్దపీట వేయాలి

- మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి



మహబూబాబాద్‌లో సీఎం కప్ క్రీడాపోటీల విజేతలతో మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, అధికారులు

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రోజురోజుకు కనుమరుగవుతున్న గ్రామీణ క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేయాలని మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న మునిసిపల్‌స్థాయి సీఎం కప్ క్రీడాపోటీలు బుధవారంతో ముగిశాయి. వివిధ క్రీడలు, అథ్లెటిక్స్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా మైదానాలను మెరుగుపర్చి క్రీడా సామగ్రిని అందించాలని చెప్పారు. విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత నివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, కమిషనర్ నోముల రవీందర్, డీఈ ఉపేందర్, జిల్లా క్రీడల అధికారి జ్యోతి, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షురాలు పుష్పలీల, క్రీడా టోర్నమెంట్ ఇన్‌చార్జి తులసి పద్మావతి, చాంప్లనాయక్, శ్రీనివాస్, కుమార్, శంకర్, అశోక్, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

బేతోలులో కానరాని అభివృద్ధి

- సీపీఎం పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాంనాయక్



బేతోలులో ప్రజలతో మాట్లాడుతున్న సీపీఎం పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాంనాయక్

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ విస్తరణలో భాగంగా విలీనమైన బేతోలులో జరిగిన అభివృద్ధి ఏమిలేదని సీపీఎం పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాంనాయక్ అన్నారు. ప్రజాసమస్యల అధ్యయనం కోసం ఇంటింటికి సీపీఎం కార్యక్రమాన్ని బుధవారం మునిసిపల్ 7వవార్డు పరిధి బేతోలులో నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం నాయక్ మాట్లాడుతూ గ్రామం నుంచి మునిసిపాలిటీలో విలీనమై వార్డుగా ఆవిష్కృతమైనప్పటికి బేతోలులో సమస్యలు ఎప్పటిలాగానే ఉన్నాయని విమర్శించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేసి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడాలన్నారు. వార్డు ఇన్‌చార్జి ఎమ్డీ రజాక్, భూక్య రాజేష్, బాబుమియా, లీల, పార్వతి, కవిత, పద్మ, రమణ, పండు, విజయ, పాషా, వెంకన్న, నరేష్ పాల్గొన్నారు.

- అర్హులైన దళితులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం వన్‌టౌన్ కార్యదర్శి రావుల రాజు, మాజీవార్డు కౌన్సిలర్ శాగంటి భాగ్యమ్మ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ మునిసిపల్ 30వ వార్డు పరిధి గుండ్లకుంటకాలనీలో సీపీఎం ఆధ్వర్యంలో ఇంటింటిసర్వేను నిర్వహించారు. చీపిరి యాకయ్య, సురేష్, భిక్షపతి, ఉపేందర్, ముత్తయ్య, వెంకటాద్రి, శైలజ, సుజాత, మౌనిక, రాజేశ్వరి, యుగంధర్, శ్రీను, ఉపేందర్, నాగేష్, శ్రీను, సాగర్ పాల్గొన్నారు.

అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలి

- గ్రూప్-2 నిర్వహణకు అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- బయోమెట్రిక్ అటెండెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలి
- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి) : టీజీపీఎస్సీ గ్రూప్-2 పరీక్ష రాసే అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. జిల్లాలో గ్రూప్-2 పరీక్ష నిర్వహణను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులంతా సమన్వయంతో పని చేయాలని చెప్పారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం గ్రూప్-2 పరీక్ష నిర్వహణ, బయోమెట్రిక్ విధానంపై చీఫ్ సూపరింటెండెంట్లు, ఐడెంటిఫికేషన్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్, డిపార్టుమెంటల్ అధికారులు, బయో మెట్రిక్ ఇన్విజిలెటర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15,16 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు గ్రూప్-2 నాలుగు పేపర్ల పరీక్షలను నిర్వహించనున్నట్లు చెప్పారు.

మహబూబాబాద్ జిల్లాలో మొత్తం 7,470 మంది అభ్యర్థులకు గాను 21 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అద్వైత్‌కుమార్‌సింగ్ వివరించారు. పరీక్ష నిర్వహణకు 21 మంది సూపరింటెండెంట్లు, 24 మంది డిపార్టుమెంటల్ అధికారులు, 23 మంది అబ్జర్వర్లు, పది ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 55 మంది బయోమెట్రిక్‌అధికారులు, 86 మంది ఐడెంటిఫికేషన్ అధికారులు, నాలుగు రూట్లలో నలుగురు లోకల్, జాయింట్ రూట్ అధికారులను నియమించినట్లు పేర్కొన్నారు. వందశాతం బయోమెట్రిక్ అటెండెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని ఆదేశించారు. ఓఎంఆర్ షీట్‌పై అభ్యర్థులు అత్యంత జాగ్రత్తగా వారి వివరాలను కేటాయించిన ఆయా బాక్సుల్లో తప్పులు లేకుండా నమోదు చేసేలా చూడాలన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్‌ఫోన్లను అనుమతించరాదన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద మెడికల్ కిట్లు, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ఇన్విజిలేటర్లతో సమావేశాలను ఏర్పాటు చేసి పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల పనితీరును సరి చూసుకోవాలన్నారు.

అభ్యర్థులకు సూచనలు..

పరీక్ష రాసే అభ్యర్థులు టీజీపీఎస్సీ వెబ్‌సైట్ ద్వారా గ్రూప్-2 పరీక్ష హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. అభ్యర్థులు హాల్ టికెట్‌ను ఏ-4 సైజు పేపర్‌లో కలర్ ప్రింట్ తీసుకోవాలని చెప్పారు. హాల్‌టికెట్‌పై అభ్యర్థులు తమ తాజా పాస్‌పోర్టు ఫొటోను అతికించాలన్నారు. డౌన్‌లోడ్ చేసిన హాల్‌టికెట్‌పై ఫొటో సరిగా ముద్రించి లేకుంటే అభ్యర్థి గెజిటెడ్ అధికారి లేదా చివరగా చదువుకున్న విద్యాసంస్థ ప్రిన్సిపాల్ అటెస్ట్‌తో మూడు పాస్‌పోర్టు ఫొటోలతో పాటు వెబ్‌సైట్‌లో పొందుపర్చిన ధ్రువీకరణ పత్రాన్ని పూర్తి చేసి ఇన్విజిలెటర్‌కు అందించాలని తెలిపారు. పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని, పరీక్ష ప్రారంభానికి అరగంట ముందే గేట్లు మూసి వేస్తామని, అభ్యర్థులు చెప్పులు మాత్రమే ధరించాలని, ఆభరణాలను ధరించరాదని సూచించారు. అభ్యర్థులు మెహిందీ, తాత్కాలిక టూటూలను వేసుకోరాదని స్పష్టం చేశారు. పరీక్ష రాసే అభ్యర్థులు హాల్ టికెట్, బ్లూ లేదా బ్లాక్‌బాల్ పాయింట్ పెన్‌తో పాటు గుర్తింపు పొందిన ప్రభుత్వ ఒరిజనల్ ఐడెండెటీ కార్డును తప్పనిసరిగా తమవెంట తీసుకువెళ్లాలని సూచించారు. అభ్యర్థులు ఎటువంటి ఆందోళనకు గురికావద్దని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. తొలుత బయోమెట్రిక్ విధానంపై అధికారులు, ఇన్విజిలెటర్లకు పవర్‌పాయింట్‌ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, కె.వీరబ్రహ్మచారి, ఆర్డీవో బలరాంనాయక్ పాల్గొన్నారు.

గాయపడిన కౌన్సిలర్ భర్త మృతి

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం శివారు గాంధీపురం 4వ వార్డు కౌన్సిలర్ చల్లాల ఉమ భర్త యాకయ్య (45) వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. గాంధీపురంకు చెందిన యాకయ్య సొంత పని నిమిత్తం మూడ్రోజుల క్రితం తన ద్విచక్రవాహనంపై మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో అటుగా వచ్చిన ద్విచక్రవాహనం ఒకదానికొకటి ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన యాకయ్యను స్థానికులు 108 ద్వారా ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ యాకయ్య మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు యాకయ్యకు భార్య ఉమ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.



యాకయ్య (ఫైల్)

- చల్లాల ఉమ భర్త యాకయ్య మృతి వార్త తెలుసుకున్న మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు యాళ్ల మురళీధర్ రెడ్డి, చిట్యాల జనార్దన్, మార్నేని రఘు, డౌలగర్ శంకర్, ఎండీ ఫరీద్, లూనావత్ అశోక్‌నాయక్, రావిష్ జిల్లా ఆస్పత్రికి చేరుకుని యాకయ్య కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.

పనిచేయని ట్రాఫిక్ సిగ్నల్స్

- అస్తవ్యస్తంగా వాహనాల రాకపోకలు
- తొర్రూరులో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని పోలీసులు

తొర్రూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ నియంత్రణ కోసం మునిసిపాలిటీ పరిధిలో ప్రత్యేకంగా సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఇవి పని చేయకపోవడంతో వాహనాల రాకపోకలు అస్తవ్యస్తంగా మారాయి. మొదట్లో ట్రాఫిక్ సిగ్నల్స్ పని చేసినా మెయింటెనెన్స్ లేకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. తొర్రూరు పట్టణానికి ప్రతీ రోజు వేలమంది ప్రయాణాలు సాగిస్తుంటారు. పట్టణం సుమారు 3 కిలోమీటర్ల మేర ఉంటుంది. సిగ్నల్స్ పని చేయకపోవడంతో ట్రాఫిక్‌లో చిక్కుకుని వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పనిచేయని సిగ్నల్ వ్యవస్థ

మునిసిపాలిటీ పరిధిలో ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ నియంత్రణ కోసం బస్టాండ్ సెంటర్, గాంధీసెంటర్, అన్నారం రోడ్డు, అంబేద్కర్ సెంటర్‌లలో ట్రాఫిక్ సిగ్నల్స్‌ను మునిసిపాలిటీ నిధులు రూ.15 లక్షలు వెచ్చించి ఏర్పాటు చేశారు. అవి ఏర్పాటు చేసి సుమారు రెండు సంవత్సరాలు గడుస్తున్నా పూర్తిస్థాయిలో నెల రోజులు పనిచేసిన దాఖలాలు లేవు. దీంతో ప్రతీరోజు వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సిగ్నల్ పని చేయకపోవడంతో ట్రాఫిక్ వ్యవస్థ అస్త వ్యస్తంగా మారింది. గురువారం సాయంత్రం పట్టణంలోని మార్కెట్ సెంటర్‌లో వాహనాలు ఎదురెదురుగా రావడంతో ఒకేసారి భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



మార్కెట్ సెంటర్‌లో భారీగా నిలిచిపోయిన వాహనాలు

నిలిచిపోతున్న వాహనాలు

తొర్రూరు మీదుగా ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్, తిరుమలగిరి, హైదరాబాద్ రూట్‌లకు భారీ వాహనాలు ప్రతీ రోజు వెళ్తుంటాయి. పట్టణంలో నుంచి వెళ్తుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. సిగ్నలింగ్ వ్యవస్థ అందుబాటులో లేకపోవడంతో గతంలో పోలీసులు బస్టాండ్ ఏరియా, మార్కెట్ సెంటర్‌లలో హోమ్ గార్డులను ఏర్పాటు చేశారు. సిగ్నల్ వ్యవస్థ పనిచేయకపోవడంతో వాహనదారులు ఇష్టానుసారంగా వెళ్లడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారింది. సిగ్నల్ వ్యవస్థ పనిచేసే విధంగా చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో వృథాగా ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్

ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలి

బొల్లం అశోక్, తొర్రూరు

పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనాలు భారీగా వస్తుండటంతో ద్విచక్ర వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీధి వ్యాపారులు, ఆటోలతో కూడా కొంత ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. డ్రైనేజీల నిర్మాణం చేపడుతున్న నేపథ్యంలో వాహనదారులు సమన్వయంగా వెళ్లాల్సి ఉంది. కానీ, ఇష్టారాజ్యంగా వెళ్తుండటంతో ట్రాఫిక్ నిలిచిపోయి ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేసేలా చర్యలు తీసుకోవాలి.

ఎస్ఎస్ఏ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

- పీఆర్టీయూ-తెలంగాణ రాష్ట్ర కోశాధికారి దేవేందర్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా విద్యాశాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని పీఆర్టీయూ-తెలంగాణ రాష్ట్ర కోశాధికారి పులి దేవేందర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జిల్లా కేంద్రంలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేస్తున్న సమ్మె గురువారం నాటికి 7వ రోజుకు చేరుకుంది. సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా విద్యారంగ బలోపేతం కోసం క్షేత్రస్థాయిలో విధు లు నిర్వహిస్తున్న ఉద్యోగులను సాదుకుంటారో, చంపుకుంటారో, ఆదుకుంటారో ప్రభుత్వం ఆలోచించాలని కోరారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేసి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తీర్చి ఆదుకోవాలన్నారు. అనంతరం ఉద్యోగులు తహసీల్దార్ సెంటర్‌లో మోకాళ్లపై కూర్చుని మానవహారం చేపట్టి నిరసన తెలిపారు. ఈసమ్మెకు మాజీ జిల్లా విద్యాశాఖాధికారి చంద్రమౌళి సంఘీభావం ప్రకటించారు. మధ్యాహ్న సమయంలో ఉద్యోగులకు తొర్రూరు కేజీబీవీ అకౌంటెంట్ విమల అల్పాహారం అందించారు. ఈ సమ్మెలో వీరన్న, ఖాదర్, భాస్కర్, నవీన్, ఉదయ్, గణేష్, సాగర్, విజయలక్ష్మీ, ఉమ, కరుణ, కల్పన, సునిత, సుమలత, సరస్వతి, ప్రమీల, కవిత పాల్గొన్నారు.



మానుకోట పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ సెంటర్‌లో మోకాళ్లపై కూర్చుని ఎస్ఎస్ఏ ఉద్యోగులు మానవహారం

చట్టాల అమలులో ప్రభుత్వాలు విఫలం

తుడుందెబ్బ జాతీయ నాయకుడు యాసం రాజు

వెంకటాపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో ఆదివాసీ చట్టాలు, హక్కులను అమలుచేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని తుడుందెబ్బ జాతీయ నాయకుడు యాసం రాజు అన్నారు. గురువారం మండలంలోని పాత్రాపురంలో చింత సోమరాజు అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆదివాసీలు కొన్ని సంవత్సరాలుగా ఆదివాసీ హక్కులు, చట్టాల కోసం త్యాగాలుచేసి సాధించు కున్న వాటిని అమలుచేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఆదివాసీల సాగులో ఉన్న భూములకు హక్కుపత్రాలు ఇవ్వాలని, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు విడుదల చేయాలని, ఆదివాసీలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం తుడుందెబ్బ మండల కమిటీని ఎన్నుకున్నారు. నాయకులు పొడెం రత్నం, వీ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ ఎన్నికలకు కసరత్తు

రఘునాథపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 36 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లతోపాటు వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎన్నికల నిర్వహణపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో మండల అధికారులు గురువారం సమావేశం నిర్వహించారు. మండలంలోని 36గ్రామ పంచాయతీల పరిధిలో 44,605 మంది ఓటర్లు ఉన్నారని, 320 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో గార్లపాటి శ్రీనివాసులు తెలిపారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే 13 లోపు తెలపాలని సూచించారు. 17న తుది పోలింగ్ కేంద్రాలను ఖరారు చేస్తామని, అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు ఇందుకు సహకరించాలని ఎంపిడీవో కోరారు. కార్యక్రమంలో ఎంపీవో వెంకటేశ్వర్లు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

● కొడకండ్ల : స్థానిక ఎన్నికల కోసం అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈమేరకు మండలంలోని రాజకీయ నాయకులతో గురువారం ఎంపీడీవో నాగశేషాద్రిసూరి సమావేశమయ్యారు. మండలంలో పెరిగిన పోలింగ్ బూత్‌ల సంఖ్య, పోలింగ్ బూత్‌లపై ఏవైనా అభ్యంతరాలుంటే ఈనెల 14 లోగా తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కొడకండ్లలో నాయకులతో సమావేశమైన అధికారులు

బాధిత కుటుంబాలకు ఎర్రబెల్లి పరామర్శ

దేవరుప్పుల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెద్దతండాకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు గుగులోత్ నర్సింహా కుమారుడు బిక్కున్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గురువారం మృతదేహానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నివాళులర్పించారు. గురువారం పెద్దతండా చేరుకుని బిక్కున్ కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సాయం అందించారు. అలాగే రంబోజీగూడెం ఎర్రకుంట తండాకు చెందిన రాజమ్మ అనారోగ్యంతో మృతి చెందగా ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జీసీసీ మాజీ చైర్మెన్ గాంధీ నాయక్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు పల్లా సుందర్‌రామ్‌రెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు బస్వ మల్లేశం, నాయకులు రాంసింగ్, కొల్లూరి సోమయ్య, కోక్యానాయక్, భగవాన్, భాషా, వసిందర్, హేమ, చిన్న, నర్సింహా, రామల్, మోహన్, మంగు, నరేందర్, బిచ్చా, రాజన్న, భద్రు, రాజు, దిలిప్ పాల్గొన్నారు.



బాధిత కుటుంబాన్ని ఓదార్చుతున్న దయాకర్‌రావు

కళాక్షేత్రం పగుళ్లపై విచారణ జరిపించాలి

- కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి
- బీజేపీ, కేయూ విద్యార్థి సంఘాల నాయకుల డిమాండ్
- చర్చనీయాంశమైన 'ఆంధ్రజ్యోతి' కథనం





కాళోజీ కళాక్షేత్రంలో పగుళ్లను పరిశీలిస్తున్న కుడా అధికారులు

హనుమకొండ టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రూ.కోట్లు వెచ్చించి.. నగరం నడిబొడ్డున ప్రజాకవి కాళోజీ నారాయణరావు పేరుతో నిర్మించిన కాళోజీ కళాక్షేత్రం గోడలకు పగుళ్లు వచ్చిన అంశంపై 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో గురువారం ప్రచురితమైన కథనం తీవ్ర చర్చనీయాంశమయ్యింది. బీజేపీ నాయకులు, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు కళాక్షేత్రాన్ని పరిశీలించేందుకు వెళ్లగా అక్కడి సెక్యూరిటీ సిబ్బంది గేటుకు తాళం వేసి ఉంచడం వివాదాస్పదమైంది. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రావుల కిషన్, కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళోజీ కళాక్షేత్రం ప్రారంభించి నెలరోజులు కాకముందే పగుళ్లు ఏర్పడటంపై కలెక్టర్ విచారణ జరిపించాలని, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించిన కళాక్షేత్రం పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించ లేదని, అందువల్లే గోడలకు పగుళ్లు వచ్చాయని ఆరోపించారు. ఇక 'ఆంధ్రజ్యోతి' కథనంతో అప్రమత్తమైన కుడా అధికారులు కళాక్షేత్రం గోడలకు వచ్చిన పగుళ్లను పరిశీలించారు. ఇవి చిన్న చిన్న లోపాలని, ఇలాంటివి సహజంగానే జరుగుతాయని, దీన్ని పెద్దదిగా చేయడం సరికాదన్నారు. వెంటనే పగుళ్లకు మరమ్మతులు చేయిస్తామని అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉంటే సుమారు రూ.95కోట్లు వెచ్చించి నిర్మించిన కాళోజీ కళాక్షేత్రం విషయంలో నాణ్యత పాటించకపోవడమేంటన్న చర్చ సర్వత్రా జరిగింది.

అవి పగుళ్లు కాదు : జీడబ్ల్యూఎంసీ కమిషనర్

కాళోజీ కళాక్షేత్రం భవనం గోడలకు వచ్చినవి పగుళ్లు కాదని, ఎలివేషన్‌లోని రెండు జీఎఫ్ఆర్‌సీ పలకల మధ్య గ్యాప్ వచ్చిందని గ్రేటర్ వరంగల్ కమిషనర్, కుడా వైస్‌చైర్మన్ అశ్వినితానాజీ వాకడే బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాళోజీ కళాక్షేత్రం గోడలకు పగుళ్లు వచ్చిన అంశంపై 'ఆంధ్రజ్యోతి'లో గురువారం కథనం ప్రచురితమైన నేపథ్యంలో ఆమె స్పందిస్తూ ఓ ప్రకటన చేశారు.

కాస్మోటిక్ చార్జీల పెంపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలి

మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 40 శాతం డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపు కార్యక్రమాన్ని ఈనెల 14న జిల్లాలోని 125 విద్యా సంస్థల్లో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం సంబంధిత అధికారులతో సమావేశమై మాట్లాడారు. డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపు కార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరై హాస్టళ్లు, పాఠశాలల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి భోజనం చేస్తారని చెప్పారు. అందుకు అనుగుణంగా విద్యార్థుల తల్లిదండ్రులకు ముందస్తు ఆహ్వానాలు పంపించాలని, విద్యా సంస్థల ఆవరణలో శానిటేషన్ చేయాలని, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నాణ్యమైన ఆహార పదార్థాలతో రుచికరమైన భోజనం సిద్ధం చేయాలని సూచించారు.

ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలపై ప్రత్యేక దృష్టి సారించి, పిల్లలకు నాణ్యమైన ఆహారం అందిస్తూ ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాబోధన అందించేందుకు కృషి చేస్తుందని చెప్పారు. అందులో భాగంగా జిల్లాలో ప్రతీ హాస్టల్‌కు ఒక అధికారిని నియమించి, ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రణాళిక ప్రకారం విద్యార్థుల స్థితిగతులను తెలుసుకుంటూ అందిస్తున్న సౌకర్యాలను తనిఖీ చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో పక్కా ప్రణాళికతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, కె. వీరబ్రహ్మచారి, జిల్లా అధికారులు పురుషోత్తం, రవీందర్‌రెడ్డి, నర్సింహాస్వామి, సైదానాయక్, సుబ్బారావు, శ్రీనివాస్, హరిప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు

- ములుగు ఫారెస్ట్ రేంజ్ అధికారి శంకర్

వెంకటాపూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అటవీ ప్రాంతంలో ఎవరైనా వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని ములుగు ఫారెస్ట్ రేంజ్ అధికారి డోలి శంకర్ హెచ్చరించారు. మండలంలోని నారాయణపూర్ గ్రామ సమీపంలోని బండ్లపహాడ్‌లో గురువారం ఆయన అటవీశాఖ సిబ్బందితో కలిసి కార్డన్‌సెర్చ్ నిర్వహించారు.

ఈ సందర్భంగా 31 గొత్తికోయ నివాసాలను తనిఖీ చేసి అటవీ జంతువులను వేటాడే ఉచ్చులు, బాణాలు, చువ్వలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆయన గొత్తికోయలను సమావేశపరిచి మాట్లాడారు. అటవీ ప్రాణులను వేటాడడం నేరమని, అనుమానితులు ఎవరైనా అడవిలో సంచరించినట్లయితే తమకు సమాచారం అందించాలని, ఇందుకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. కలప అక్రమ రవాణా, ఇసుక రవాణా సమాచారం అందజేయాలని సూచించారు. కాగా, ములుగు జిల్లాలో పెద్దపులి సంచరిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవు తున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి యాకూబ్‌జాని, సెక్షన్ అధికారి రవీందర్, బీట్ అధికారులు రాజేశ్వరి, సుప్రియ, స్వర్ణల త, రూప్‌కుమార్, శివశంకర్, భద్రు, రాజేష్, హనుమంతు, శ్యామ్‌సుందర్, బేస్‌క్యాంప్ సిబ్బంది తదితరు లు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న బాణాలను చూపుతున్న రేంజ్ అధికారి శంకర్

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2315	2080
పల్లికాయ (సూక)	4020	4000
పల్లికాయ (పచ్చిది)	4250	5500
కందులు	-	-
పెసళ్లు	6812	6000
పత్తి	7100	5800
పసుపు (కాడి)	11111	11000
పసుపు (గోల)	11209	10500
తేజ మిర్చి	12000	9000
తేజ మిర్చి (కొత్తది)	16000	12000
తేజ ఏసీ	15500	14000
వండర్ హాట్ ఏసీ	13000	11000
యూఎస్ 341ఏసీ	14500	11000
దేశీ ఏసీ	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	7000	3000

- వరంగల్ వ్యవసాయం



కృష్ణవేణిని సన్మానిస్తున్న జనగామ జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా

పారా త్రోబాల్ క్రీడాకారిణి మాచర్ల కృష్ణవేణికి సన్మానం

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విశ్వనాథపురం గ్రామస్థురాలు మాచర్ల కృష్ణవేణి డిసెంబరు 5, 6, 7న కాంబోడియా దేశంలో జరిగిన ఇంటర్నేషినల్ సిట్టింగ్ పారా త్రోబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి భారతదేశానికి గోల్డ్‌మెడల్ తీసుకువచ్చింది. విషయం తెలుసుకున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా గురువారం కలెక్టర్ కార్యాలయంలో కృష్ణవేణికి స్వీట్స్ తినిపించి శాలువాతో సత్కరించారు. జనగామ జిల్లా నుంచి అంతర్జాతీయ స్థాయికి వెళ్లడం సంతోషకరమైన విషయమని, ఇంటర్నేషినల్ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించి దేశానికి, జిల్లాకు పేరు తీసుకురావడం అభినందనీయమని కలెక్టర్ కొనియాడారు. రానున్న రోజుల్లో పారా ఒలంపిక్స్ పోటీలకు ఎంపికయ్యేలా సాధన చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఫ్లోరెన్స్, జిల్లా క్రీడల విభాగం అధికారి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ సభ్యత్వాల సర్టిఫికెట్ల అందజేత



రెడ్‌క్రాస్ శాశ్వత సభ్యత్వ సర్టిఫికెట్లు అందజేస్తున్న చైర్మన్ వరప్రసాద్

తొర్రూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మహబూబాబాద్ శాఖలో 2017-18 నుంచి శాశ్వత సభ్యులుగా చేరి సేవా కార్యక్రమాలు అందిస్తున్న వారికి సర్టిఫికెట్‌లను అందిస్తున్నట్లు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మహబూబాబాద్ శాఖ చైర్మన్ పి.వరప్రసాద్ తెలిపారు. గురువారం తొర్రూరులోని లయన్స్ క్లబ్ ఆవరణలో జరిగిన సమావేశంలో సర్టిఫికెట్‌లు అందజేసి ఆయన మాట్లాడారు. ఇండియాలోని అన్ని నగరాల్లో రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు అందిస్తుందని, పేద ప్రజల సంక్షేమానికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్యాట్రన్ సభ్యులు డాక్టర్ కె.రాజేందర్ రెడ్డి, టి.విశ్వేశ్వరరావు, యాదగిరి రెడ్డి, వీరభద్ర రావు, జి. వెంకన్న, సరేష్, రేగూరి వెంకన్న, డాక్టర్ రాం నర్సయ్య, కిరణ్‌కుమార్ ఉన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు



కేంద్ర మంత్రి జువల్‌ని సన్మానిస్తున్న హుస్సేన్‌నాయక్

మహబూబాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : న్యూఢిల్లీలో కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జువల్ ఓరంను జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి జువల్ ఓరంకు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా హుస్సేన్‌నాయక్ మాట్లాడుతూ వరంగల్ కాకతీయ యూనివర్సిటీలో విద్యనభ్యసించే విద్యార్థులకు 500 మంది సామర్థ్యం గల వసతి గృహం అవసరం ఉందని మంత్రి దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. వసతిగృహ భవన నిర్మాణం కోసం రూ.20 కోట్లు అవసరం ఉంటుందని, ఇందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం భీమునిపాదం జలపాతంను పర్యాటక కేంద్రంగా చేసేందుకు, గిరిజన యువత ఉపాధికొరకై సుమారు రూ.13 కోట్లతో అటవీశాఖ అధికారులతో ప్రణాళిక రూపొందించామని మంత్రికి వివరించినట్లు చెప్పారు. తద్వారా ఆప్రాంత గిరిజనులకు ఉపాధి లభించనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు స్పందించిన మంత్రి కేంద్ర ప్రభుత్వం ద్వారా సత్వర సహకారం అందించనున్నట్లు వివరించారు. గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ నుంచి పీహెచ్‌డీ పరిశోధన విద్యార్థులకు ప్రతీ సంవత్సరం ఇచ్చే రూ.750 ఉపకార వేతనాల కోసం అనేక మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని హుస్సేన్‌నాయక్ కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు.



రాజేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న మానవ హక్కుల సంఘం సభ్యులు

వైబ్రెంట్ విద్యా సంస్థల అధినేత రాజేందర్‌రెడ్డికి సన్మానం

హనుమకొండ టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): 20 ఏళ్లుగా తన బోధనల ద్వారా విద్యాసంస్థలలో ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దిన వైబ్రెంట్ విద్యాసంస్థల అధినేత చిట్టిరెడ్డి రాజేందర్‌రెడ్డి సేవలను గుర్తించి మానవహక్కుల సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. హనుమకొండలోని రాయల్ ఫంక్షన్ గార్డెన్‌లో రాజేందర్‌రెడ్డి దంపతులకు శాలువా కప్పి భారత సేవారత్న బిరుదును బహూకరించి ఘనంగా సన్మానించారు. రాజేందర్‌రెడ్డి 2019లో మహిళా డిగ్రీ కళాశాలను స్థాపించి ఎంతోమంది పేద విద్యార్థులకు సేవ చేసినట్లు తెలిపారు. ఆయన సేవలను గుర్తించి సన్మానం చేసినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



రాజు (ఫైల్)

సంగెం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గవిచర్ల గ్రామంలో జరిగిన పెళ్లిలో పాల్గొని తిరిగి స్వగ్రామం వెళుతుండగా బైక్ అదుపు తప్పి కిందపడి యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. సంగెం పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా వెంకటాపూర్ మండల కేంద్రానికి చెందిన నీరటి రాజు, గుండా సురేష్, కుక్కల పవన్‌లు ఈనెల 7న గవిచర్ల గ్రామంలో జరిగే పెళ్లికి బైక్‌పై ముగ్గురు వచ్చి తిరిగి స్వగ్రామం వెళుతున్నారు. అదే రోజు రాత్రి 11 గంటలకు వెళుతుండగా మండలంలోని ఆశాలపల్లి- కాపులకనపర్తి గ్రామాల మధ్యన గల ఓ రైస్‌మిల్లు వద్ద అదుపు తప్పి కిందపడ్డారు. వాహనం నడుపుతున్న నీరటి రాజు(23)కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఎంజీఎంకు తరలించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లో గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు చెప్పారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసుకుని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందించినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. మృతుడు ప్రైవేటు ఉద్యోగిగా పనిచేస్తున్నట్లు ఎస్సై చెప్పాడు.

యువకుడు ఆత్మహత్య



భరత్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలోని నందినగర్ కాలనీలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నందినగర్‌కు చెందిన భట్టు సుజాత-రమేష్ దంపతులకు ముగ్గురు కుమారుల్లో రెండోవాడు భరత్ (25) జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో కుక్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొన్ని నెలలుగా అస్తమా వ్యాధితో బాధపడుతున్నాడు. బాధను భరించలేక నాలుగు రోజుల క్రితం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగాడు. జిల్లా ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ.. భరత్ మృతి చెందాడు. మృతుడికి తల్లి సుజాత, ఇద్దరు సోదరులు ఉన్నారు.

నలుగురు కలెక్టర్లకు హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు పరిహారం చెల్లింపులో జాప్యంపై వివరణ ఇవ్వాలని నాలుగు జిల్లాల కలెక్టర్‌లకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ విషయంలో ఎందుకు కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోకూడదని ప్రశ్నించింది. ఆత్మహత్య చేసుకున్న రైతులకు పరిహారం ఇవ్వాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై గతేడాది విచారణ జరిగింది. ఇది పరిశీలనలో ఉందని, నాలుగు నెలల్లో చెల్లిస్తామని ప్రభుత్వం హైకోర్టుకు హామీ ఇచ్చింది.

ఏడాది దాటినా పరిహారం చెల్లించకపోవడంపై కొండల్‌రెడ్డి అనే వ్యక్తి కోర్టు ధిక్కరణ వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. యాదాద్రి భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, జనగాం, ఆదిలాబాద్ జిల్లాల కలెక్టర్‌లకు నోటీసులు జారీచేసింది. కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను ఎందుకు స్వీకరించరాదో వివరణ ఇవ్వాలని పేర్కొంది. తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా పడింది.

కుంభమేళాకు ప్రత్యేక రైలు

నెహ్రూసెంటర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : భారత ప్రముఖ పర్యాటక కేంద్రాలైన కాశీవిశ్వనాథ్, విశాలక్ష్మి అన్నపూర్ణదేవి, శ్రీరామజన్మభూమి, హనుమాన్‌గిరి అయోధ్యలో జరిగే కుంభమేళాకు దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో ప్రత్యేక రైళ్లను కేటాయించినట్లు టూరిజం ఎగ్జిక్యూటివ్ పవన్ సెంగార్ తెలిపారు. ఈ మేరకు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో గురువారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 19న ప్రత్యేక రైలు సికింద్రాబాద్ నుంచి ప్రారంభమై భువనగిరి, జనగామ, కాజీపేట, వరంగల్ మీదుగా సాయంత్రం 4 గంటలకు మహబూబాబాద్ స్టేషన్‌కు చేరుకుంటున్నట్లు చెప్పారు. డోర్నకల్, ఖమ్మం, మధిర, విజయవాడ మీదుగా టూరిజం ప్రాంతాలకు వెళ్లనున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రజలు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ ప్రత్యేక రైలులో ప్రయాణికులకు సౌకర్యార్థంగా ప్రత్యేక గదులు, ఏసీ, నాన్ ఏసీ సౌకర్యాలతోపాటు క్యాటరింగ్ సౌకర్యం ఉంటుందన్నారు. ప్రతీ 75 మందికి టీం లీడర్‌లు మేనేజ్‌మెంట్ చేస్తారని చెప్పారు. పూర్తి సమాచారం కోసం ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ http://www.irctctourism.comను సంప్రదించాలన్నారు. పూర్తి వివరాల కోసం సెల్ : 971260701, 9287030711లకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ ఇన్‌చార్జి నరేష్, టూరిజం మెంబర్ ప్రశాంత్ పాల్గొన్నారు.



మానుకోటలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న టూరిజం ఎగ్జిక్యూటివ్ పవన్ సెంగార్

పులి మడుగు



ప్రకృతి సోయగం

గూడూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఎత్తైన కొండలు.. అరుదైన వృక్షాలు.. అబ్బురపరిచే జలపాతం.. పచ్చని ప్రకృతి అందాలతో ఎంతో ఆహ్లాదాన్ని పంచుతున్నాయి చారిత్రక పులిమడుగు గుట్టలు. ఒకప్పుడు పులులకు ఆవాసంగా ఉండే ఈ ప్రాంతంలో ఇప్పుడు పలు వన్యప్రాణులున్నాయి. ఎలుగుబంట్లు, జింకలు, కనుజు, మూషికజింక, చుక్కల దుప్పులు, కుందేళ్లు, అడవి పందులు, నెమళ్లు, ఇతరత్ర వన్యప్రాణులతో పాటు పశుపక్ష్యాదులు, ఔషధ గుణాలు కలిగిన చెట్లు ఇక్కడి ప్రత్యేకం. మహబూబాబాద్ జిల్లాలో 1.50లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న పులి మడుగు ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని గత ప్రభుత్వంలో అధికారులు ప్రతిపాదనలు చేశారు. తాజాగా, ప్రకృతి పర్యాటక కేంద్రంగా సర్కార్ గుర్తించడంతో పర్యాటకంగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందబోతోందని అధికారులు చెకబుతుండగా.. పర్యాటకులను ఆకర్షించేలా సఫారీ, బర్డ్‌వాచ్, ట్రెక్కింగ్, బోటింగ్, ఉండడానికి వసతి సౌకర్యాలను కల్పిస్తే బావుంటుందని ప్రకృతి ప్రేమికులు అభిప్రాయ పడుతున్నారు.

12 ప్రకృతి సర్క్యూట్లలో ఒకటి..

పర్యాటక రంగం అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టిసారించింది. రాష్ట్రంలో అటవీ, అటవీ ఇతర ప్రాంతాలు కలిపి మొత్తం 12 సర్క్యూట్‌లను అధికారులు గుర్తించారు.

వీటిలో భద్రాద్రి కొత్తగూడెం సర్కిల్ పరిధిలోని మహబూబాబాద్ జిల్లా గూ డూరు రేంజ్ పరిధిలోని పులిమడుగు అటవీప్రాంతాన్ని చేర్చారు. పులిమడుగు ప్రాంతం వన్యప్రాణుల ఆవా సానికి అనువుగా ఉంటుంది. ఇక్కడి దట్టమైన అడవిలో నీటి వనరులు పుష్కలంగా ఉండటం, విశాలమైన గడ్డి మైదానాలు, రాళ్ల గుట్టలు, గూహలు వాటి ఆవాసానికి అనుకూలంగా ఉంటాయి.

పులిమడుగులో క్యాంపెయిన్ సైట్..

గూడూరు, గంగారం, కొత్తగూడ, బయ్యారం సరిహద్దుల్లో ఉన్న ఈ పులిమడుగులో అటవీశాఖ ఆధ్వర్యంలో రూ.18 లక్షల నిధులతో క్యాంపెయిన్ సైట్, సోలార్ బోరు, నీటి కుంటలను ఏర్పాటు చేశారు.

గూడూరు రేంజ్ పరిధిలోని మట్టేవాడ శివారు కొంగరిగిద్ద నుంచి కొడిశలమిట్ట సమీపంలో పులిమడుగు ప్రాంతం ఉంది. అక్కడి వరకు తాత్కాలికంగా రోడ్డును ఏర్పాటు చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రం నుంచి పులిమడుగుకు చేరుకోవాలంటే కేవలం 40 కిలోమీటర్లు ఉంటుంది. హనుమకొండ, గూడూరు మీదుగా పులిమడుగు వరకు సుమారు 100 కిలోమీటర్ల వరకు ఉంటుంది. ఇప్పటికే అరకొరగా ఉన్న సౌకర్యాలతోనే పర్యాటకులు వచ్చి సందడి చేస్తున్నారు. కొంగరిగిద్ద నుంచి పులి మడుగు వరకు రోడ్డు సౌకర్యం, సఫారి, బర్డ్‌వాచ్, ట్రెక్కింగ్ బోటింగ్ లాంటి సౌకర్యాలు కల్పిస్తే పులి మడుగుకు ఉమ్మడి వరంగల్ జిల్లా నుం చే కాకుండా ఖమ్మం, హైదరాబాద్, భద్రాద్రి కొత్తగూడెం నుంచి పర్యాటకులు వస్తారని, తద్వారా అటవీశాఖకు, ప్రభు త్వానికి ఆదాయం సమకూరుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే పులిమడుగు పర్యాటక కేంద్ర అభివృద్ధి కోసం గతంలో కంప అడిషనల్ పీసీసీఎఫ్ సువర్ణ, అడిషనల్ పీసీసీఎస్ ఫర్గీన్, భద్రాద్రి కొత్తగూడెం సీసీఎఫ్ భీమా నాయక్, అప్పటి మహబూబాబాద్ కలెక్టర్ శశాంక, డీఎ్ ఫవో రవికిరణ్, ప్రస్తుత డీఎఫ్‌వో బత్తుల విశాల్, గూడూరు ఎఫ్‌డీవో చంద్రశేఖర్‌రావు, వరంగల్ డీఎఫ్‌వో అపర్ణలు సందర్శించారు. పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు తమవంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

- విశాలమైన అడవులకు నెలవు
- వన్యప్రాణుల మనుగడకు అనువైన ప్రాంతం
- పర్యాటకులను ఆకట్టుకుంటున్న ప్రకృతి అందాలు
- అభివృద్ధి చేస్తే మరింత ఆదరణ

పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి
మాజీ జడ్పీ కోఆప్షన్ సభ్యుడు, గూడూరు



గూడూరు అటవీశాఖ రేంజ్ పరిధిలో ఉన్న పులిమడుగు అటవీ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి. కొంగరిగిద్ద నుంచి పులిమడుగు వరకు రహదారిని ఏర్పాటు చేయాలి. పర్యాటకులకు ట్రెక్కింగ్, బర్డ్‌వాచ్, సఫారీ, బోటింగ్, వసతి సౌకర్యం కల్పించాలి. పులిమడుగులో పర్యాటకుల సందడి పెరిగితే అటవీశాఖకు ఆదాయం సమకూరనుంది.

పులిమడుగు జీవ వైవిధ్యానికి కేంద్రం
ఎఫ్ఆర్వో , మహబూబాబాద్ జిల్లా



పులిమడుగులోని పచ్చని వాతావరణం సకల ప్రాణుల ఆవాసానికి అనుకూలంగా ఉంటుంది. ఈ ప్రాంతంలో నీటిఊటలు, వాగులు, వంకలు, అరుదైన వృక్షశిలాజాలు ఉన్నాయి. ఇది శాకాహార జంతువులతో పాటు క్రూర జంతువులకు కూడా ఆవాసంగా ఉంది. పులిమడుగును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఇప్పటికే అటవీశాఖ ఆధ్వర్యంలో ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. ఇప్పటికే పులిమడుగులో క్యాంపెయిన్ సైట్, నీటికుంటలు, సోలార్ బోర్‌ను ఏర్పాటు చేశాం.



పులి మడుగులో బోటింగ్ చేస్తున్న అటవీ శాఖాధికారులు



పులిమడుగులో క్యాంపెయినింగ్ సైట్‌ను ప్రారంభిస్తున్న అటవీశాఖ ఉన్నతాధికారులు (ఫైల్)



పులిమడుగులో పర్యటిస్తున్న అటవీశాఖ అధికారులు

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

వరంగల్ మెడికల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేరళలో నిర్వహించిన రీజినల్ స్థాయి హెచ్ఐవీ, ఎయిడ్స్ క్విజ్ పో టీలలో హనుమకొండ జిల్లా విద్యార్థులు తృతీయ బహుమతి సాధించారు. ఈ కాంపిటీషన్‌లో విద్యార్థులు విధాత్రి, ఖలీముల్లా బహుమతిలో భాగంగా రూ.20వేల నగదు, ప్రశంసా పత్రం అందుకున్నారు. విజేతలను, తోడ్పాటు అందించిన మేనేజర్ స్వప్న మాధురిలను హనుమకొండ డీఎంహెచ్ఓ ఏ.అప్పయ్య, అదనపు డీఎంహెచ్ఓ మదన్‌మోహన్‌రావు అభినందించారు.



బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

గురువులకే గురువు.. గురుదత్తుడు



ములుగురోడ్‌లోని సచ్చిదానంద వరద దత్తక్షేత్రంలో కొలువుదీరిన దత్తాత్రేయుడు

- 15న దత్త జయంతి.. వేడుకలకు దత్తక్షేత్రంలో ఏర్పాట్లు
- పౌర్ణమి హోమం, అన్నప్రసాద వితరణ
- భక్తులతో 54 సార్లు దత్తస్థవ పారాయణం

ఆధ్యాత్మికం

వరంగల్ కల్చరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆది గురువు గురువులకే గురువు.. అత్రి అనసూయ మాతల పుత్రుడు దత్తాత్రేయుడు. యోగా మూర్తిగా నిరంతరం భక్తులను అనుగ్రహించే దత్తుడి జయంతి రోజైన ఈ నెల 15న వరంగల్ ఉమ్మడి జిల్లాలో దత్తాల యాల్లో, సాయిబాబా దేవాలయాల్లో గురు పరంపరల ఆశ్రమాలలో అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. మార్గశిర మాసం కృత్తికా నక్షత్రం పౌర్ణమి రోజున దత్తాత్రేయ స్వామి జన్మదినం సందర్భంగా స్వామికి విశేష అభిషేకాలు, అర్చనలు, హోమాలు, అలంకరణలు, భజనలు, హారతులు, అన్నదానాలు నిర్వహించడానికి ఆలయాల్లో ఏర్పాట్లు చేశారు.

తైలంతో అభిషేకం విశేష ఫలం

దత్తాత్రేయ స్వామికి నువ్వుల నూనెతో అభిషేకం నిర్వహిస్తే విశేష అనుగ్రహం కలుగుతుందని, మంచి జరగడం కోసం, అనారోగ్యాల బారి నుంచి కాపాడుకోవడం కోసం పౌర్ణమి రోజున నువ్వుల నూనెలో ముఖం చూసుకొని ఆ తైలంతో దత్తాత్రేయ స్వామికి అభిషేకం చేయాలని, దాంతో విశేషఫలం కలుగుతుందని పురాణాలు చెబుతున్నాయి. దత్తా.. దత్తా.. అని స్మరణ చేస్తే సంతుష్టుడయ్యే మూర్తి గా దత్తాత్రేయుడిని ఆరాధిస్తారు. స్వామికి భజనలు, నామస్మ రణలంటే ప్రీతి. గురు పరంపరలో ఆది గురువుగా ప్రసిద్ధికెక్కిన అవదూతగా దత్తాత్రేయస్వామిని గురువుగా కొలుస్తారు.

దత్తక్షేత్రంలో వేడుకలు

రాష్ట్రంలోనే స్థిరమూర్తిగా కూర్చొని ఉన్న దత్తాత్రేయస్వామి ములుగురోడ్‌లోని శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రంలో కొలువు దీరాడు. ఏటా దత్తజయంతి రోజున ఇక్కడ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆదివారం 15న ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులతో తైలాభిషేకాలు, హోమంతో పాటు 54 సార్లు శ్రీదత్తస్థవ పారాయణంనిర్వహిస్తారు. మహా అన్నప్రసాద వితరణను కూడా ఏర్పాటు చేశారు. ఇక ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని సాయిబాబా దేవాలయాలు, గురు ఆశ్రమాల్లో 15న దత్త జయంతి వేడుకలు, హారతులు, అన్నదానం, హోమాలు, అభిషేకాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

నారుమడికి జెండా అండ



పక్షుల నుంచి నారుమడిని కాపాడుకునేందుకు పార్టీ జెండాలను ఏర్పాటు చేసి తన అభిమానాన్ని చాటుకున్నాడు ఓ రైతు. కేసముద్రం మండలంలోని తాళ్లపూసపల్లి శివారులో మహబూబాబాద్ వెళ్లే రహదారి వెంట ఓ నారుమడికి నాలుగువైపులా కాంగ్రెస్ పార్టీ జెండాలను ఏర్పాటు చేశాడో రైతు. స్వతహాగా కాంగ్రెస్ అభిమాని అయిన సదరు రైతు.. తనకే కాదు నారుమడికి కూడా అభయ 'హస్తం' అన్నట్టుగా పార్టీ జెండాలను ఏర్పాటు చేశాడంటూ దారినపోయేవారు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.

\- కేసముద్రం, ఆంధ్రజ్యోతి

బహుముఖ ప్రజ్ఞాశాలి.. వలస పైడి





మన టీవీ, యూ ట్యూబ్‌లో పాఠాలు బోధిస్తున్న పైడి

- వ్యాఖ్యాతగా, కవిగా రాణిస్తున్న ఉపాధ్యాయుడు
- అర్ధాంగి జ్ఞాపకాలతో 'మాఇంటి బతుకమ్మ' పుస్తక ప్రచురణ
- విద్యాశాఖ, పలు ప్రభుత్వ కార్యక్రమాలకూ సమన్వయకర్త

కీర్తి పతాక

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆయన భావిపౌరులను తీర్చిదిద్దే ఉపాధ్యాయుడు. సమాజాన్ని నిర్దేశించే సామాజిక సాహితీవేత్త. టీచర్ వృత్తిలో కొనసాగుతూనే దూరదర్శన్ విద్యా సంబంధ కార్యక్రమాలు, ఆకాశవాణిలో పలు కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా, సాహితీ కార్యక్రమాలకు సమన్వయకర్తగా, నాటకాల్లో పాత్రధారిగా, కవిగా, రచయితగా బహుముఖ రంగాల్లో ప్రతిభను చాటుతున్నారు. ఆయనే హనుమకొండ జిల్లా కేంద్రంలోని మర్కజీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు వలస పైడి. కరోనా సమయంలో పైడి పేరుతో యూట్యూబ్ చానల్‌ను ప్రారంభించి 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు 72 పాఠాలను రూపొందించి బోధించారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని అంబాల పక్కనున్న శ్రీరాములపల్లిలో వలస ఉప్పలయ్య, కట్టమ్మ దంపతులకు జన్మించిన పైడి అక్కడి ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక విద్యాభ్యాసం, అంబాల జడ్పీహెచ్‌ఎస్‌లో 6 నుంచి టెన్త్ వరకు పూర్తి చేశారు. ఆరో తరగతిలోనే సాహిత్యంపై మక్కువ పెంచుకున్న పైడి.. శ్రీరాములపల్లిలోని భజన మండలి ప్రదర్శించే నాటకాలకు సాహిత్యం అందించారు. అంతేకా దు ఆరో తరగతిలోనే లవకుశ నాటకంలో రైతు పాత్ర వేశారు. వరంగల్‌లోని విశ్వేశ్వర సంస్కృతాంధ్ర కళాశాల, కడప జిల్లా లోని ప్రొద్దుటూర్‌లో ఉపాధ్యాయ పండిత శిక్షణ అనంతరం 1996లో వరంగల్ మట్టెవాడ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరారు.

11 పుస్తకాల రచన

వలస పైడి వ్యాఖ్యాతగానే కాకుండా కవి, రచయిత గాను ఖ్యాతిగడిస్తు న్నాడు. సామా జిక స్పృహ కలిగిన కవిగా రాణిస్తూ 11 పుస్తకాలను ఆయన రచించారు. తన అర్ధాంగి సునీత మరణించగా ఆమె గుర్తులను 'మా ఇంటి బతుకమ్మ'గా పదిలపరుచుకున్నారు. 'ఆచార్య దేవోభవ' పేరుతో 5 బాలల నాటికలను పుస్తకంగా రచించారు. 'మా పల్లె పచ్చబడ్డది' అనే సైన్స్ నేపథ్యంతో ఉన్న నాటికి రాష్ట్ర స్థాయిలో ప్రదర్శింపబడింది. 'ఆకురా లిన వసంతం' అనే పరిశోధానత్మక పుస్తకంతో పాటు 'మా నాయిన' అనే గేయ కవిత్వం, 'కొత్త పొద్దు', 'తెలంగాణ జయ కేతనం' పేరుతో తెలంగాణ ఆవిర్భావం సందర్భం పై పుస్తకాలు రాశారు. ఇలా సాహిత్యంలోని అన్ని కోణాలను స్పృశిస్తూ రచనలు చేస్తున్నారు.

విద్యా శాఖ కార్యక్రమాలకు ఆయనే వ్యాఖ్యాత

జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏ కార్యక్రమం నిర్వహించాలన్నా వ్యాఖ్యాతగా వలస పైడి ఉండాల్సిందే అంటే అతిశయోక్తి కాదు. 1997లో జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో వ్యాఖ్యాతగా అరంగేట్రం చేసిన పైడి వేలాది కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు.

టీశాట్ (మన టీవీ)లో లైవ్ లెసన్ ప్రజెంటర్‌గా పనిచేశారు. ఇవే కాకుండా ప్రభుత్వం నిర్వహించిన జిల్లా స్థాయి కాకతీయ ఉత్సవాలు, ఓరుగల్లు కళావైభవాలు కార్యక్రమాలకు వ్యాఖ్యానం అందించారు. జిల్లాలో నిర్వహించే వివిధ సాహి తీ సమ్మేళనాలు, పుస్తకావిష్కరణలు, ఉగాది పండుగ వేళ దూరదర్శన్‌లో నిర్వహించే కవి సమ్మేళనానికి, వేయి స్తంభాల గుడిలో నిర్వహించే కవి సమ్మేళనాలకు వలస పైడియే వ్యాఖ్యాతగా ఉంటారు.

వరంగల్ ఆకాశవాణిలో డాక్టర్ అంపశయ్య నవీన్ రాసిన బాంధవ్యాలు అనే నాటికను 18 ధారావాహికాల్లో ఆయా పాత్రల్లో పరకాయ ప్రవేశం చేసి వ్యాఖ్యానం చేశారు. అలాగే 42 ధారావాహికాల్లో 101 బాలల కోసం భారత కథలు వ్యాఖ్యానం చేశారు. అలాగే అనేక నాటకాల్లో వివిధ పాత్రలకు ఆయన ప్రాణం పోశారు.

సీఎంలు, మంత్రుల కార్యక్రమాలకు..

జిల్లాకు వచ్చే ముఖ్యమంత్రులు, మంత్రుల కార్యక్రమాలకు పైడినే అధికారులు వ్యాఖ్యాతగా ఎంచుకుంటున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ములుగు రాయినిగూడెంలో నిర్వహించిన కార్యక్రమానికి వ్యాఖ్యానం చేశారు. అలాగే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తన హయాంలో నర్సంపేటలో నిర్వహించిన గ్రామజ్యోతి కార్యక్రమానికి పైడినే వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

అవార్డులెన్నో...

2017లో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి సత్కారం పొందారు. రెండు సార్లు జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా గౌరవాన్ని దక్కించుకున్నారు. ఢిల్లీలో దళిత సాహిత్య అకాడమీ వారి ఉత్తమ కవిగా అవార్డు అందుకున్నారు. లయన్స్, రోటరీ క్లబ్‌ల నేషనల్ బిల్డర్ అవార్డు పొందడంతో పాటు పలు స్వచ్ఛంద సంస్థల నుంచి వలస పైడి అనేక మార్లు సత్కారాలు అందుకున్నారు.



అప్పటి డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి నుంచి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు తీసుకుంటున్న పైడి

ఎల్డర్ లైన్ 14567

మీ కోసం

బాలసముద్రం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మన సంస్కృతిలో కుటుంబంలోని పెద్దల పట్ల ఎంతో గౌరవం ఉండేది. కానీ సామాజికంగా, ఆర్థికంగా వస్తున్న మార్పుల కారణంగా ఆ గౌరవం సన్నగిల్లుతోంది. ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై కుటుంబం అంటే భార్య, భర్త, పిల్లలు మాత్రమే అనే పరిస్థితి వచ్చింది. చివరకు తమను పెంచిపెద్ద చేసిన.. ప్రయోజకులను చేసిన అత్తా,మామ, తల్లిదండ్రులకు వారింట్లో స్థానంలేకుండా పోయింది. ఫలితంగా ఆ తల్లిదండ్రులు చరమాంకంలో నిర్లక్ష్యానికి గురవుతున్నారు. నేటి సమాజంలో చాలా మంది వయోవృద్ధులు తమ పిల్లల నుంచి సరైన ఆదరణకు నోచుకోక.. ఆర్థిక ఇబ్బందులు, ఒంటరితనం, దూషణలు, ఎన్నో అవమానాలు భరిస్తూ బతుకుతున్నారు. ఇక జీవిత భాగస్వామిని కోల్పోయిన, సంతానం లేని వృద్ధుల పరిస్థితి అయితే ఇంకా దారుణంగా ఉంటోంది. అలాంటి వృద్ధుల సంరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయి. చట్టాలను అమలు చేస్తున్నాయి. రాజ్యాంగంలో వయో వృద్ధులకు కూడా ప్రాథమిక హక్కులున్నాయి. హిందూ దత్తత పోషణ చట్టం ప్రకారం వృద్ధులైన తల్లిదండ్రుల పోషణ బాధ్యత సంతానంపైనే ఉంటుంది. అంతేగాక తల్లిదండ్రులు తమను తాము పోషించుకోలేని స్థితిలో పిల్లల నిరాధరణకు గురైనప్పుడు చట్టం ద్వారా ప్రభుత్వం వారి పోషణకు అయ్యే ఖర్చులను పిల్లల నుంచి ఇప్పిస్తోంది.



వయో వృద్ధుల సంక్షేమం కోసం ప్రత్యేక ప్రభుత్వ శాఖ

చట్టంపై అవగాహన లేకపోవడం, చట్టం నిబంధనల గురించి తెలియకపోవడంతో వయో వృద్ధులు ఎన్నోసమస్యలతో నిస్సహాయంగా బాధపడుతున్నారు. 2007లో రూపొందించిన తల్లిదండ్రులు వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం 2011లో నియమావళి రూపొంది అమలులోకి వచ్చింది. చట్టాన్ని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా విభాగాన్ని ఏర్పాటు చేసింది. వయో వృద్ధుల వ్యధను తీర్చేందుకు, గౌరవంగా జీవించేందుకు అవసరమైన ప్రభుత్వ పథకాలను, కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం ఆ విభాగం ప్రధాన కర్తవ్యం. మారుమూల పల్లెల్లో నివసిస్తున్న వయోవృద్ధులకు చట్టం గురించి తగు అవగాహన కల్పించి అవసరమైన సౌకర్యాలు కల్పించే బాధ్యత అధికారులపై ఉంటుంది.

ఎల్డర్ లైన్, ప్రత్యేక ట్రిబ్యునల్ ఏర్పాటు

నిర్లక్ష్యానికి గురైన వయోవృద్ధుల పరిస్థితులను చక్క దిద్దేందుకు వారికి అవసరమైన సామాజిక భద్రత, ఆరోగ్య పరిరక్షణ, సురక్షితమైన ఆశ్రయం, బలవర్థకమైన ఆహారం దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఆసరా పింఛన్, ఆరోగ్య శ్రీ లాంటి పథకాలను అమలు చేస్తోంది. బాధితులైన వయో వృద్ధులకు త్వరితగతిన న్యాయం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రెవెన్యూ డివిజన్లలో ట్రిబ్యూనళ్లను, జిల్లా స్థాయిలో అప్పిలేట్ ట్రిబ్యూనళ్లను ఏర్పాటు చేసింది. అంతేగాక బాధిత వృద్ధులకు సత్వరం సులభంగా సహాయం అందించడానికి ప్రత్యేకమైన ఉచిత సహాయక ఫోన్ నంబర్ 14567 (ఎల్డర్‌లైన్)ను ఏర్పాటు చేసింది. సాధారణంగా తల్లిదండ్రులు వృద్ధాప్య దశకు చేరుకున్నాక తమ పేరున ఉన్న స్థిరాస్థులను తమ పిల్లల పేరున మార్పిడి చేస్తారు. ఆస్తి మార్పిడి అయ్యాక కొంత కాలానికి పిల్లలు తమ తల్లిదండ్రుల పోషణ, బాగోగులను పట్టించుకోకుండా నిర్ధయగా ప్రవర్తిస్తే విధిలేని పరిస్థితుల్లో వారు ప్రభుత్వ సహాయాన్ని కోరవచ్చు. ఎల్డర్‌లైన్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించినా లేదా సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారిని కలిసి సమస్యను విన్నవించుకున్నా పరిష్కరించి తగిన న్యాయం చేస్తారు. పిల్లల పేరున బదిలీ చేసిన ఆస్తిని తిరిగి తల్లిదండ్రుల పేరున మార్పిడి చేస్తారు. ఇది ఆస్తిని అనుభవించే వారసులందరికీ చట్టం వర్తిస్తోంది.

- ఆదరణకు నోచుకోని వృద్ధుల కోసం ఫోన్‌నెంబర్
- తక్షణమే సాయం అందించేలా ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- రెవెన్యూ డివిజన్లు, జిల్లాల స్థాయిలో ప్రత్యేక ట్రిబ్యునళ్లు
- వయోవృద్ధుల సంరక్షణ చట్టం అమలుకు విభాగం ఏర్పాటు

వృద్ధుల సంక్షేమం కోసం సంఘం ..

వయో వృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వ పరంగానే కాకుండా స్వచ్ఛందంగా సేవలందించేందుకు సామాజిక స్పృహకలిగిన పలువురు రిటైర్డ్ ఉద్యోగులు ముందుకొచ్చారు. రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్య అధ్యక్షుడిగా.. తేరాల యుగంధర్ ప్రధాన కార్యదర్శిగా సుమారు 100 మంది రిటైర్డ్ ఉద్యోగులు కలిసి హనుమకొండ జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేశారు. తమవంతు కర్తవ్యంగా నగరంలోని రోడ్లవెంట చలిలో వణుకుతున్న అనా థ వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్నారు. లయన్స్‌క్లబ్ సహకారంతో కంటి చికిత్స శిబిరాలు, డీఎంహెచ్‌వో, ఆయుష్ డిపార్ట్‌మెంట్ సహకారం తో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. వరంగల్‌లోని ఎంజీఎం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స కోసం వచ్చే వృద్ధులకు ప్రత్యేక ఓపీ ఏర్పాటు చేయాలం టూ సంక్షేమ సంఘం నాయకులు చేసిన కృషి ఫలితంగానే ప్రత్యేక ఓపీ ని ఏర్పాటు చేశారు. అంతేగాక సమస్యల పరిష్కారం కోసం పోలీసు స్టేషన్‌కు వచ్చే వృద్ధుల సౌకర్యార్థం చట్టపరంగా ప్రతీ పోలీసు స్టేషన్‌లో వృద్ధ మిత్ర కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని అధికారులకు విన్నవిస్తున్నారు.

వృద్ధులు పనికిరాని వారు కాదు..



వృద్ధులను పనికి రాని వారుగా పరిగణించవద్దు. జీవితంలో వారు గడించిన అనుభవాలు ఎన్నో ఉంటాయి. అంతేగాక జ్ఞాన సంపన్నులై ఉంటారు. సమాజం వారి సేవలను ఉపయోగించుకోవాలి. రిటైర్ అయిన ఉద్యోగులంతా తమ ఉన్నతికి అవకాశం కల్పించిన సమాజ అభివృద్ధి, సంక్షేమం కోసం శాయశక్తుల కృషి చేయాలి.

దామెర నర్సయ్య, రిటైర్డ్ డీఎస్పీ, వృద్ధుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

క్రీడాకారులను ప్రోత్సహించడం కోసమే సీఎం కప్

మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి

కేసముద్రం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, ఒలంపిక్స్ స్థాయికి తీసుకువెళ్లేందుకే రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ పోటీలను నిర్వహిస్తోందని మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి అన్నారు. ధన్నసరి సేయింట్ జాన్స్ స్కూల్‌లో గురువారం రాత్రి మండలస్థాయి సీఎం కప్ పోటీల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ జిల్లా స్థాయికి ఎంపికైన క్రీడాకారులు మండలానికి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్లు అంబటి మహేందర్‌రెడ్డి, అల్లం నాగేశ్వర్‌రావు, మార్కెట్ కమిటీ సభ్యులు ఎండీ.అయూబ్‌ఖాన్, చిదిరాల వసంతరావు, చింతకుంట్ల యాదగిరి, ఎంపీడీవో క్రాంతి, కార్యదర్శి ఎన్.రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూపు-2 కేంద్రాల వద్ద సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ అమలు

- **21 సెంటర్లలో హాజరు కానున్న 7,680 మంది అభ్యర్థులు**
- **ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్**



మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈనెల 15, 16 తేదీల్లో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించనున్న గ్రూపు-2 పరీక్ష సెంటర్ల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ యాక్ట్-2023 (భారతీయ నాగరిక్ సురక్షా సంహిత) అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ సుధీర్‌రాంనాథ్‌కేకన్ గురువారం తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలో ఈ పరీక్షలకు 7,680 మంది అభ్యర్థులు హాజరు కానుండగా, 21 సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రెండు రోజులపాటు జరిగే పరీక్షలకు ఈనెల 15న ఉదయం 6 గంటల నుంచి 16 సాయంత్రం 6 వరకు సెక్షన్లు అమలులో ఉంటాయన్నారు. ఎగ్జామ్ సెంటర్లకు 200 మీటర్ల దూరం వరకు 5 గురికి మించి గుంపులుగా ఉండరాదన్నారు. పరీక్షలు ముగిసే వరకు ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలకు, మైకులు, డీజేలతో ఊరేగింపులు, ధర్నాలు, ప్రచారాలు నిర్వహించరాదన్నారు. పరీక్ష సమయంలో పరిసరాలలోని ఇంటర్నెట్ సెంటర్లు, జిరాక్స్ సెంటర్లు, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలన్నారు. ఎగ్జామ్ వేళ ఎటువంటి ఆటంకాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో పోలీస్ పెట్రోలింగ్ పార్టీలను నియమించినట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని, ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ పరీక్షలు ప్రశాంతంగా జరిగే వరకు అన్నివర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని సూచించారు.

రేపటి జాతీయ మెగా లోక్ ఆదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కోర్టు ఆవరణలో ఈనెల 14న జరిగే జాతీయ మెగా లోక్ ఆదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ గురువారం ఒకప్రకటనలో తెలిపారు. క్రిమినల్ కేసులు, సివిల్ తగాద కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబ పరమైన కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంకు రికవరి, విద్యుత్ చౌర్యం, చెక్‌బౌన్స్ లాంటి కేసులను కక్షిదారులు రాజీపడే అవకాశం ఉందన్నారు. రాజీ పడడమే రాజామార్గమని చెప్పారు. చిన్నచిన్న కేసులతో కక్ష్యలు పెంచుకుని కోర్టుల చట్టు తిరుగుతూ సమయాన్ని, డబ్బులను వృథా చేసుకోవద్దన్నారు. జిల్లాలోని పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుళ్లు, ఇతర పోలీస్ సిబ్బంది రాజీపడదగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారీని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీపడేలా చూడాలన్నారు. ఈ లోక్ ఆదాలత్ ద్వారా బాధితులకు సత్వరన్యాయం జరుగుతుందని చెప్పారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలని ధర్నా

నెల్లికుదురు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నగూడెం లబ్ధిదారులకు ఇండ్లస్థలాలు కేటాయించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ రాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాజన్న మాట్లాడుతూ రామన్నగూడెంలో 1998లో 60 మంది లబ్ధిదారులకు ఇళ్లస్థలాలకు ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందని, ఆ స్థలంలో ప్లాట్లుచేసి ఇవ్వకకపోవడంతో ఇండ్లు నిర్మించుకోలేక పోయారన్నారు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో గత 30 ఏండ్లుగా లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఎం మండల కార్యదర్శి ఇసంపెల్లి సైదులు బాబు గౌడ్, లబ్ధిదారులు బండి సోమయ్య, మైస రాములు, ఆది కొమురయ్య మల్యాల శ్రీను, నర్సమ్మ పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలపై ఇంటింటా సీపీఎం సర్వే



పెరుమాండ్ల సంకీసలో సర్వే నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

డోర్నకల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలుపై డోర్నకల్ మండలం పెరుమాండ్లసంకీసలో గురువారం సీపీఎం ఆధ్వర్యంలో ఇంటింటా సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు శెట్టి వెంకన్న మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేయడంలో విఫలమయ్యారన్నారు. గ్యాస్ సబ్సిడీ 20 శాతం మందికి కూడా అమలు కావడం లేదన్నారు. అలాగే 40 శాతం మంది రైతులకు రుణ మాఫీ కాలేదని చెప్పారు. గృహలక్ష్మి, ఆసరా పింఛన్‌ల పెంపు హామీ అటకెక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొబ్బ లక్ష్మి, పార్టీ నాయకులు ఆర్.కొండయ్య, కొర్ని శ్రీను, షేక్.జహీరాఖాన్, ఐలపంగి వెంకటనారాయణ, బొబ్బ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

● ఇనుగుర్తి : మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. గ్రామాల్లో నూతన రేషన్‌కార్డులు, పింఛన్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పార్టీ మండల కమిటీ సభ్యుడు కావటి నర్సయ్య తెలిపారు. గ్రామ శాఖ కార్యదర్శి ఆవుల వెంకన్న, బండి సత్యం, ఆవుల ఉప్పలయ్య, పేశెట్టి ఉప్పలయ్య, ఎస్‌కె అమీర్, మట్టపెల్లి నర్సయ్య, అనీల్, యాకయ్య, యాకమ్మ పాల్గొన్నారు.

ఇందిరమ్మ కమిటీలపై కౌన్సిలర్ల నిరసన

డోర్నకల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ మునిసిపల్ పరిధిలో ఇటీవల ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కమిటీలలో తమను నామమాత్రంగా చేర్చాడం సరికాదని కౌన్సిలర్లు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ ఇందిరమ్మ కమిటీలలో తమ ప్రమేయం లేకుండానే తమవార్డుల్లో కమిటీలు ఏర్పాటు ఎలా చేస్తారని కౌన్సిలర్లు మునిసిపల్ చైర్మన్ వీరన్న ఎదుట వాపోయారు. ఇది తమను అవమానించడమేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో మౌనిక జైన్, పోటు జనార్దన్, కొత్త రాధిక, శరత్‌బాబు పాల్గొన్నారు.

'సన్నాలకు ఇచ్చే బోనస్ వెంటనే చెల్లించాలి'

కురవి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన సన్నవడ్లకు ధరతో పాటు ప్రభుత్వం ఇచ్చే బోనస్ కలిపి ఒకేసారి చెల్లించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కురవిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించి, మాట్లాడారు. తేమపేరుతో రైతులను ఇబ్బందులు పెట్టకుండా ప్రభుత్వం ఇచ్చే బోనస్‌ను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి కర్నం రాజన్న, బుర్ర సమ్మయ్య తురక రమేష్, కన్నె వెంకన్న, బొల్లం ఉప్పలయ్య, సైదులు, ప్రవీణ్ పాల్గొన్నారు.

తప్పుడు వీడియో వైరల్ చేసిన

వారిపై చర్య తీసుకోవాలి

ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్



అసెంబ్లీ స్పీకర్, మండలి చైర్మన్‌కు ఫిర్యాదు చేస్తున్న రాంచంద్రునాయక్

మరిపెడ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల సన్నివేశాలను ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ మాటాడని అంశాలను ఎడిట్ చేసి, తప్పుడు వీడియోను సోషల్ మీడియాలో బీఆర్ఎస్ వారియర్స్ వైరల్ చేశారని బుధవారం రాత్రి రాంచంద్రునాయక్ అసెంబ్లీ స్పీకర్, మండలి చైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన వారు కఠిన చర్యలు తీసుకోవా ల్సిందిగా డీజీపీని ఆదేశించినట్లు సమాచారం. రాంచంద్రునాయక్ అసెంబ్లీలో మాట్లాడిన విషయాలను వైరల్ వీడియోలను స్పీకర్, మండలి చైర్మన్‌కు అందచేశారు.

ఎమ్మెల్యే భాషను వక్రీకరించిన వారిపై ఎస్పీకి ఫిర్యాదు

కురవి : శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో డోర్నకల్ ఎమ్మెల్యే రాంచందర్ నాయక్ మాటతీరును మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో ప్రచారం చేసిన వారిపై కేసు నమోదు చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రం మాట్లాడారు. రాంచందర్‌నాయక్ గిరిజన విద్యావేత్త, వైద్యుడు, ప్రజల మన్ననలతో ఎమ్మెల్యేగా గెలిచి, విప్‌స్థాయిలో అసెంబ్లీలో మాట్లాడిన మాటలను వక్రీకరించడం సరికాదన్నారు. కొంతమంది బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యేపై బురద చల్లాలని చూస్తున్నారని, వారికి తగినబుద్ధి చెబుతామన్నారు. దీనికి సంబంధించి పోలీసులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్‌నాయక్, డోర్నకల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ బండి శ్రీనివాస్, గొల్లపల్లి రజినీకాంత్, బాలగాని శ్రీనివాస్, కురవి దేవాలయ చైర్మన్ కొర్ని రవీందర్‌రెడ్డి, ఎస్.రాజేందర్‌కుమార్, దడిగెల శరత్, దయ్యాల శ్రీధర్, గండు మురళి, బస్వ మణి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన డీఏవో

కేసముద్రం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రంలోని పలు ఎరువులు, పురుగుమందుల విక్రయ దుకాణాలను గురువారం జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా షాపుల్లోని రికార్డులను, స్టాకు ను పరిశీలించారు. ఎరువులు, పురుగుమందులు, విత్తనాల విక్రయాల్లో తప్పనిసరిగా రిజిష్టరును నిర్వహించాలని సూచించారు. స్థానిక రాజరాజేశ్వరి షాపులో ఎరువుల లైసెన్సులో కం పెనీకి చెందిన ఫాంను జత చేయకపోవడంతో 21 టన్నుల యూరియా, 10.55టన్నుల కాంప్లెక్స్ ఎరువుల విక్రయాలను తాత్కాలికంగా నిలిపివేయాలని ఎంఏవో బి.వెంకన్నను ఆదేశించారు. సదరు ఫాంను జత చేసిన తర్వాతనే విక్రయించాలని సూచించారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

కేసముద్రం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్వలలో గురువారం ఆకుల సుధాకర్‌కు చెందిన పాడిగేదె ప్రమాదశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు బాధిత రైతు తెలిపారు. మధ్యాహ్నం సమయంలో మేతకోసం చెల్కలోకి వెళ్లిన గేదె అప్పటికే తెగిపడి ఉన్న విద్యుత్ వైరుకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ రూ.90 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు వేడుకున్నాడు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే

డోర్నకల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది జనవరిలో నిర్వహించిన ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇండ్ల కోసం వచ్చిన దరఖాస్తుల ఆధారంగా ఇందిరమ్మ ఇండ్ల సర్వే జరుగుతుందని తహసీల్దార్ కృష్ణవేణి అన్నారు. గురువారం డోర్నకల్ ఎంపీడీవో కార్యాలయంలో సెర్ప్, గ్రామపంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మా ట్లాడుతూ ప్రతీ గ్రామపంచాయతీ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే కోసం ప్రభుత్వం యాప్‌ను అందుబాటులోకి తెచ్చిందని, యాప్‌లో ఉన్న నిబంధనల మేరకు సర్వే నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, సెర్ప్ ఏపీఎం శంకర్ పాల్గొన్నారు.

మాల సహకార సంఘం ఆధ్వర్యంలో సాయం

కేసముద్రం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అమినాపురంలో ఇటీవలె మృతి చెందిన బొల్లెద్దు ధర్మయ్య కుటుంబానికి గ్రామ మాలసహకారం సంఘం ఆధ్వర్యంలో రూ.15 వేల సహాయాన్ని అందించారు. సంఘం గౌరవ సలహాదారుడు నాగెల్లి అంద్రయ్య, బొల్లెద్దు విజయ్‌చందర్, ఇస్సాక్, సామేల్, యాకయ్య, నాగేష్, సతీష్, అనిల్, కోళ్లపూడి వెంకన్న, నాగెల్లి ప్రియతం, సుమిత్, నందన్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

దంతాలపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని మండల అధికారుల బృందం గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగాతహసీల్దార్ రాజేశ్వర్, ఎంపీడీవో వివేక్‌రామ్, పంచాయతీ కార్యదర్శి ఏశబోయిన వెంకన్న మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం తాజా కూరగాయలు, భోజనాన్ని అందించా లన్నారు. విద్యార్థుల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పదని హెచ్చరించారు. ఎంపీవో మహ్మద్ అఫ్సరపాష పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారుల బృందం సభ్యులు

సౌకర్యాలు ఉన్న చోటే పోలింగ్ కేంద్రాలు



పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్

డోర్నకల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో ఓటుహక్కు వినియోగించుకునేందుకు వచ్చే ప్రజలకు సౌకర్య వంతంగా ఉన్నచోటనే పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. ఎంపీడీవో కార్యాల యంలో గురువారం ఆయా రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామపంచా యతీల్లో ఓటర్లసంఖ్యను బట్టీ వార్డులు, పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఎన్డీ నాయకులు చిలకారెడ్డి, యాస భాస్కర్, బీఎస్పీ నాయకుడు కిరణ్, ప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష

గార్ల : త్వరలో జరుగబోయే గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు గ్రామాల్లో రాజకీయ పార్టీల నాయకులు శాంతియుతంగా జరిగేలా సహకరించాలని ఎంపీడీవో ఎ.మంగమ్మ విజ్ఞప్తి చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో జీపీ ఎన్నికల నిర్వహణపై ఆయా రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించే విధంగా ప్రతీ ఒక్కరు అధికారులకు సహకరించాలన్నారు. కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ధనియాకుల రామారావు, కె.శ్రీనివాస్, అలువాల సత్యవతి, గంగావత్ లక్ష్మణ్‌నాయక్, విమల్‌కుమార్‌జైన్ పాల్గొన్నారు.

మోడల్ స్కూళ్లలో సమస్యలు పరిష్కరించాలి



గుర్తూర్ మోడల్ స్కూల్‌లో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

తొర్రూరు రూరల్, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఆదర్శ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పీఎంటీఏ జిల్లా అధ్యక్షుడు పరుపాటి కిరణ్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం గుర్తూర్ మోడల్ స్కూల్‌లో భోజన విరామ సమయంలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులను పాఠశాల విద్యాశాఖలో విలీనం చేసి 010 కింద జీతాలు చెల్లించాలని కోరారు. నోషనల్ సర్వీస్, నోషనల్ ఇంక్రిమెంట్, హెల్త్‌కార్డులు, కారుణ్య నియామకాలు, పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మోడల్ స్కూల్ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వప్న, నరసింహా రావు, లింగయ్య, వెంకన్న, కృష్ణ, ప్రసాద్, ప్రవీణ్‌కుమార్, హరికృష్ణ, స్రవంతి, నవనీత పాల్గొన్నారు.



బాధితుడికి సెల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న ఏఎస్ఐ సాంబయ్య, బ్లూకోట్స్ పీసీలు రాజు, వెంకన్న

15 నిమిషాల్లో సెల్ లభ్యం.. మ్యాన్యువల్‌గా వెతికిన కానిస్టేబుళ్లు

కేసముద్రం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఇనుగుర్తి మండలం అయ్యగారిపల్లికి చెందిన కొంతం మహేందర్ గురువారం మధ్యాహ్నం తన సెల్‌ఫోన్ పోగొట్టుకోగా 15 నిమిషాల్లో కానిస్టేబుళ్లు వెతికి అందజేశారు. అయ్యగారిపల్లి పెట్రోల్ బంకు వద్దనుంచి ఇనుగుర్తి పెద్దబస్టాండ్‌కు బైక్‌పై వచ్చిన మహేందర్ తన ప్యాంటు జేబులో పెట్టుకున్న సైలెంట్‌మోడ్‌లో ఉన్న సెల్‌ఫోన్ పోయినట్లు గుర్తించాడు. ఆ ప్రాంతంలో టీ తాగుతున్న బ్లూకోట్స్ కానిస్టేబుళ్లు ఆర్.రాజు, కె.వెంకన్నకు ఈ విషయాన్ని బాధితుడు తెలిపాడు. ఇరువురు కానిస్టేబుళ్లు వెంటనే మహేందర్ వచ్చిన మార్గంలో వెతికగా చెరువుకట్ట వెంట పొలాల్లోకి జారి ముళ్లపొదల్లో ఉన్న సెల్‌ఫోన్‌ను గుర్తించారు. అనంతరంపోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐ సాంబయ్య చేతుల మీదుగా మహేందర్‌కు సెల్‌ఫోన్ తిరిగి అందజేశారు. ఈ సందర్భంగా సెల్‌ఫోన్‌ను శ్రమించి వెతికిపెట్టిన కానిస్టేబుళ్లను ఎస్ఐ మురళీధర్‌రాజ్‌తోపాటు పలువురు అభినందించారు.

ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం

గార్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో ఈనెల 15 నుంచి జనవరి 14 వరకు ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు కాందూరి శ్రీనివాసచారి తెలిపారు. శ్రీలక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో నెలరోజుల పాటు వివిధ రూపాల్లో పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని అర్చకుడు కోరారు.

కోటి మృతి సీపీఐకి తీరనిలోటు

● **నాయకుడు కట్టెబోయిన శ్రీనివాస్**

గార్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల సీపీఐ నాయకుడు పల్లా కోటి మృతి ఆ పార్టీకి తీరనిలోటు అని నాయకుడు కట్టెబోయిన శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన కోటి సంస్మరణ సభకు హాజరై మాట్లాడారు. కోటి విద్యార్థి దశ నుంచి సీపీఐ ఉద్యమాల్లో చురుకైన పాత్రపోషించినట్లు చెప్పారు. ఆయన ఆశయసాధన కోసం ప్రతీ ఒక్కరు పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో జంపాల వెంకన్న, జడ సత్యానారాయణ, అలవాల సత్యవతి, కందునూరి శ్రీనివాస్, జి.సక్రు, సారిక శ్రీను, గంగావత్ లక్ష్మణ్‌నాయక్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను ప్రభుత్వాలు పరిష్కరించాలి

కురవి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలను ప్రభుత్వాలు తక్షణమే పరిష్కరించాలని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి భూక్య హరి, మాలోతు కిషన్‌నాయక్ డిమాండ్ చేశారు. ప్రజాసమస్యలపై అధ్యయనం కోసం గిరిజన సంఘం ఆధ్వర్యంలో బలపాల శివారు లింగ్యా తండా, లక్ష్మీతండా, గాజాతండాల్లో గురువారం సర్వే నిర్వ హించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన తండాల్లోసరైన రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ దీపాలు, పైపులైన్‌లు సరిగా లేవని చెప్పారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు దేవానాయక్, బాలునాయక్, నవీన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలను పెంచాలి



రాజోలులో మాట్లాడుతున్న ఆకుల రాజు

కురవి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బయ్యారంలో ఉక్కుఫ్యాక్టరీ స్థాపించి, యువతకు ఉపాధి అవకాశాలు పెంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆకుల రాజు డిమాండ్ చేశారు. రాజోలులో సీపీఎం ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన ఇంటింటా సర్వేను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాల్లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ సాధ్యం కాదని ప్రకటించడం సరికాదన్నారు. ప్రభుత్వం గతంలో ఇనుప ఖనిజనిల్వలు ఉన్నాయని ప్రకటించిందని, ఫ్యాక్టరీని ఏర్పాటు చేయకపోతే సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో మిలిటెంట్ పోరాటాలు నిర్వహిస్తామ న్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి మలేడి కోటయ్య, నాలం వెంకన్న, రాయల మనోహర్, ఎస్‌కె మల్సూర్, గొల్లపల్లి కృష్ణ, వెంకట్, రాములు పాల్గొన్నారు.

శాంతిమార్గాన్ని అనుసరించాలి

సీరోలు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఏసు చూపిన మార్గం అనుసరించి, శాంతియుతంగా జీవించాలని పీటర్ విజయ్ అన్నారు. ఉప్పరగూడెం ఏసుకృపా మందిరంలో పాస్టర్ వంగజాన్ మార్క్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు నిర్వహించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన విజయ్ మాట్లాడుతూ పభువు ప్రజలను ప్రేమించి, వారిని పాపం నుంచి రక్షించుటకే క్రీస్తు ఈ లోకంలో కల్వరి సిల్వలో తన ప్రాణం పెట్టి తిరిగిలేచాడని తెలిపారు. పాస్టర్లు బాలరాజ్, కృపానందం, విజయ్‌కుమార్, జాన్‌వెస్లీ, డేవిడ్, ప్రభుదాస్, జీవమణి, క్రీస్తుదాస్, లుథియమ్మ, యాకోబు, హనోక్, ఆనంద్, రాకేష్, ఏసుపాదం, జాన్‌పీటర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేతోనే అభివృద్ధి : కాంగ్రెస్

మరిపెడ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్‌తోనే పేదలకు అభివృద్ధి సంక్షేమ పథకాలు అందుతున్నాయని మరిపెడ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తాజుద్దీన్ అన్నారు. గురువారం ఆయన స్థానిక కాంగ్రెస్ నేతలతో కలిసి మాకులతండా, దేశ్యాతండా, బోడా అమృతండా, గ్యామాతండా, చౌక్లాతండాలకు చెందిన పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రవికాంత్, సురేశ్, చిన్న, బాధవత్ వెంకన్న, బోడా రవి, రాంబాబు, బానోత్ నరేష్, లక్ష్మణ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

మరిపెడ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ కేంద్రంలోని సాయిబాబా మందిరంలో గురువారం ఆ ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయినాథుడికి ఆలయ అర్చకుడు రవీంద్రాచారి ప్రత్యేక పూజలు జరిపి భక్తులకు ప్రసాద పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెంపటి లక్ష్మీనారాయణ, బోనగిరి సత్యానారాయణ పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● **డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బి.రాములు**

తొర్రూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బి.రాములు అన్నారు. గురువారం కళాశాల ఆవరణలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ విద్యార్థులు తమ వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దన్నారు. ఫోన్‌లలో ఓటీపీలు, పేటీఎం, ఫోన్‌పే, గూగుల్‌పే కైవైసీ అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లకు స్పందించవద్దన్నారు. సైబర్ నేరాలకు గురైనపుడు 1930 నంబరుకు డయల్ చేసి తెలియ జేయాలని, ఫేక్ కాల్స్ వస్తే స్పందించవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ రాజేందర్ ప్రసాద్, వెంకటేశ్వర్లు, వాల్యానాయక్, రవీందర్‌రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళా శాల ప్రిన్సిపాల్ రాములు



రోడ్డుపై గుంతలు పూడ్చుతున్న ఎన్ఎస్ఎస్ సిబ్బంది

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

తొర్రూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని నెల్లికుదురు రోడ్డులో ఉన్న గుంతలను పూడ్చి సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ సేవా సంస్థ ఆధ్వర్యంలో నిరంతరం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని, విద్యార్థుల్లో దేశ భక్తి, సామాజిక సేవ కల్పించేందుకు ఎన్ఎస్ఎస్ కృషి చేస్తుందని తెలిపారు. ప్రతీ విద్యార్థి సామాజిక బాధ్యత కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వరూప్, భరత్, శైలేష్, హరీష్, రాజు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దంతాలపల్లిలో ముగిసిన సీఎం కప్ టోర్నమెంట్



దంతాలపల్లిలో ప్రారంభ మ్యాచ్‌లో విద్యార్థులతో కబడ్డీ ఆడుతున్న గిర్దావర్ నజీముద్దీన్

దంతాలపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈనెల 8 నుంచి ప్రారంభమైన మండలస్థాయి సీఎం కప్ క్రీడలు గురువారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి స్థానిక ఎస్సై రాజు, తహసీల్దార్ రాజేశ్వర్, ఎంపీడీవో వివేక్‌రాం పాల్గొని విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. ఇక్కడ రాణించిన టీం సభ్యులు జిల్లాలో బాగా ఆడాలని కోరారు. జిల్లాస్థాయి క్రీడలకు టీమ్ సభ్యులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో దంతాలపల్లి పంచాయతీ కార్యదర్శి కమిటీ చైర్మన్ ఏశబోయిన వెంకన్న, ప్రభుత్వ పాఠశాల పీడీ నాగిరెడ్డి, జ్యోతిబా పూలే ప్రిన్సిపాల్ శ్రీనివాస్, గిర్దావర్ నజీముద్దీన్ పాల్గొన్నారు.